క్లుప్తంగా

వడ్డాదిలో అంబేడ్కర్ జయంతి వేడుకలు



కేక్ కట్ చేసి సంబరాలు చేస్తున్న నాయకులు

బుచ్చెయ్యపేట: వడ్డాది నాల్గు రోడ్ల జంక్షన్‌లో శనివారం రాత్రి అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ 133వ జయంతి సందర్భంగా దళిత సంఘాల జిల్లా యువజన అధ్యక్షుడు బూసి కోటి, మాడుగుల వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీను తదితరులు జై భీమ్ నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాల్గు రోడ్ల జంక్షన్‌లో మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి దిమ్మ వద్ద అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పలువురికి మిఠాయిలు పంచిపెట్టారు. ప్రతి ఒక్కరూ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. మాజీ ఎంపీటీసీ పేరమ్మ, నాయకులు సూరిబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు మజ్జిగ పంపిణీ



విద్యార్థులతో మజ్జిగ తాగిస్తున్న ఉపాధ్యాయులు, బ్యాంక్ అధికారులు

నర్సీపట్నం: ఎండల తీవ్రతతో అల్లాడుతున్న విద్యార్థులకు మజ్జిగ పంపిణీకి ఇండియన్ బ్యాంక్ వారు శ్రీకారం చుట్టారు. పట్టణంలోని జెడ్పీ హైస్కూల్(తురకబడి)లో 420 మంది విద్యార్థులకు మజ్జిగ స్పాన్సర్ చేశారు. ఈ కార్యక్రమాన్ని హెచ్‌ఎం ఎ.వి.రమణ, ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు ప్రారంభించారు. ఐదు రోజుల పాటు మజ్జిగ పంపిణీ చేసిన బ్యాంక్ అధికారులకు హెచ్‌ఎం ధన్యవాదాలు తెలియజేశారు.

నేడు అంబేడ్కర్ విగ్రహ ప్రారంభోత్సవం

నాతవరం: స్థానిక ప్రధాన కూడలిలో నూతనంగా నిర్మించిన అంబేడ్కర్ మెమోరియల్ పార్కు, డిజిటల్ గ్రంథాలయాన్ని ఆదివారం ప్రారంభించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని ఏఎంపీ కోర్ కమిటీ సభ్యులు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ఇక్కడ రూ. 25 లక్షలతో అంబేడ్కర్ విగ్రహంతోపాటు పార్కు, డిజిటల్ గ్రంథాలయం నిర్మించాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, దివంగత అంకంరెడ్డి జమీలు ఆధ్వర్యంలో తీర్మానించామన్నారు. దాతలు, గ్రామస్తులు సహకారంతో రూ.10 లక్షలతో అంబేడ్కర్ విగ్రహం పార్కు డిజిటల్ గ్రంథాలయం ఏర్పాటు చేశామన్నారు. మిగతా పనులు పూర్తి చేసేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు.

మద్యం కేసుల్లో ఇద్దరి అరెస్టు

నాతవరం: మద్యం అక్రమ రవాణా, సారా తయారీ చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ రామారావు తెలిపారు. జిల్లేడుపూడికి చెందిన అల్లు రమణ మద్యం సీసాలు అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. అతని వద్ద నుంచి 38 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. వల్సంపేట పంచాయతీ శివారు తాళ్లపాలెం గ్రామానికి చెందిన ఈరే జోగారావు అటవీ ప్రాంతంలో సారా తయారు చేసేందుకు బట్టీ ఏర్పాటు చేశాడని, అందిన సమాచారం మేరకు దాడి చేసి, 400 లీటర్ల పులుపు ధ్వంసం చేశామని చెప్పి, జోగారావును అరెస్టు చేసినట్టు చెప్పారు.

గర్భిణులు, చిన్నారులకు టీకాలు



గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న ఏఎన్ఎం

కె.కోటపాడు: కె.అగ్రహారం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఏఎన్ఎం బి.చిన్నమ్ములు గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. ఐదేళ్ల లోపు 19 మంది చిన్నారులకు వ్యాధినిరోధక టీకాలు వేశారు. ఆరుగురు గర్భిణులకు ధనుర్వాతం రాకుండా టీకాలు వేశారు. ఆకుకూరలతోపాటు బెల్లం, పప్పుదినుసులతో కూడిన పదార్థాలను గర్భిణులు తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు వెంకటలక్ష్మి, లక్ష్మి పాల్గొన్నారు.

టీడీపీకి ఓటేస్తే అన్ని వర్గాలకు కష్టాలే..

- వైఎస్సార్‌సీపీ గెలుపుతోనే సంక్షేమం కొనసాగింపు
- ఎన్నికల ప్రచారంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



మేడివాడలో ఓటరును అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

రావికమతం: దగాకోరు హామీలతో ప్రజల్లోకి వస్తున్న టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడును నిలదీయాలని వైఎస్సార్‌సీపీ చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం రాత్రి మేడివాడలో ధర్మశ్రీ ఇంటింటికీ తిరిగి ఓటర్లను కలిశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన పథకాల గురించి వివరించారు. పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పాలన అందించారన్నారు. గత టీడీపీ పాలనలో 600కుపైగా హామీలిచ్చిన చంద్రబాబు ఏ ఒక్కటైనా అమలు చేశారా? అని ప్రశ్నించారు. రైతు, డ్వాక్రా రుణాలు మాఫీ చేయకుండా మోసం చేశారని దుయ్యబట్టారు. ఇంటికో ఉద్యోగం ఇస్తానని చెప్పి ఒక్క నిరుద్యోగికి న్యాయం చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు మోసపూరిత హామీలతో ప్రజలను మభ్యపెట్టడానికి వస్తున్న చంద్రబాబును నిలదీయాలని కోరారు. స్వప్రయోజనాల కోసమే పొత్తులు కుదుర్చుకున్నారని దుయ్యబట్టారు. పేదలంటే ఎంత అయిష్టమో వృద్ధులకు, దివ్యాంగులకు వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీ చేయకుండా అడ్డుకోవడమే నిదర్శనమన్నారు. 14 ఏళ్ల చంద్రబాబు పాలనలో అష్టకష్టాలు పడిన ప్రజలు మరలా టీడీపీకి ఓటేస్తే కడగండ్లు తప్పవన్నారు. ఓటేస్తే ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అఖండ విజయం అందించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దంట్ల వెంకటరమణ, ముఖ్య నాయకులు కంచిపాటి జగన్నాథరావు, మాజీ జెడ్పీటీసీ ఆశరి వాసుగోవిందరావు, మేడివాడ ఎంపీటీసీ సత్యప్రసాద్ పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వానికి ప్రజలంతా అండగా నిలవాలి

- గొండుపాలెంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధ ప్రచారం



గొండుపాలెంలో ఓటర్లను కలిసి అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధ

కె.కోటపాడు: కులం, మతం, పార్టీలతో సంబంధం లేకుండా ప్రజలకు ఐదేళ్లుగా సంక్షేమ పాలన అందించారని వైఎస్సార్‌సీపీ మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం రాత్రి గొండుపాలెంలో ఆమె ఇంటింటికీ తిరిగి ఓటర్లను కలిశారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీ, ఎమ్మెల్యే ఓట్లును ఫ్యాన్ గుర్తుపై వేయాలని అభ్యర్థించారు. తొలుత గ్రామ పెద్దలు అపూర్వ స్వాగతం పలకగా, మహిళలు హారతులిచ్చారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఐదేళ్లలో గొండుపాలెం గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశారన్నారు. ఆయన స్ఫూర్తితో ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత తాను గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. మంచి చేయాలన్న ఆశయంతో తండ్రి బాటలో నడుస్తూ రాజకీయాల్లోకి వచ్చినట్లు తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. ప్రభుత్వం ద్వారా సీఎం జగన్ అందిస్తున్న ఆర్థిక తోడ్పాటుతో పేద కుటుంబాల్లో ఆర్థిక వెలుగులు నిండనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, ఎంపీటీసీ వంటాకు నారాయణమ్మ, మాజీ సర్పంచ్ వంటాకు శ్రీను, గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మాజీ డైరెక్టర్ దొగ్గ ఉమాశంకర్, వంటాకు నాయుడు(మామిడికాయలు), బండారు అప్పలపాత్రుడు, బండారు ముత్యాలనాయుడు, గొర్రుపోటు వెంకటరావు, చీపురుపల్లి అచ్చిబాబు, ఆదిరెడ్డి రామునాయుడు, రొంగలి రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట

రావికమతం: ఒమ్మవరం రామాలయంలో సీతా రామ లక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి, వినాయక, లక్ష్మీదేవి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు శనివారం వేడుకగా జరిగాయి. గ్రామంలో జీర్ణోద్ధరణకు గురైన ఆలయాన్ని పూర్తిగా తొలగించారు. దాని స్థానంలో సర్పంచ్ తోట సంజీబు, గ్రామస్తులు ఆలయాన్ని పునర్నిర్మించి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా తప్పెటగుళ్ల పోటీలు నిర్వహించారు. అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

వడదెబ్బకు గురికుండా అవగాహన

నాతవరం: ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ఉపాధి కూలీలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్న తెలిపారు. మర్రిపాలెం, డి.యర్రవరం, నాతవరం, బెన్నవరం, గుమ్మడిగొండ గ్రామాల్లో కూలీలకు వడదెబ్బకు గురికాకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలపై శనివారం ఆమె అవగాహన కల్పించారు. ఉదయం పది గంటలలోపే పనులు ముగించుకోని ఇంటికి చేరుకోవాలన్నారు.

అసత్య పోస్టులపై యర్రాపాత్రుడు ఫిర్యాదు



ఎస్ఐకు ఫిర్యాదు చేస్తున్న యర్రాపాత్రుడు

మాకవరపాలెం: సామాజిక మాధ్యమాల్లో అసత్య పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని సీనియర్ నాయకుడు, బూరుగుపాలెం ఎంపీటీసీ సభ్యుడు రుత్తల యర్రాపాత్రుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనపై రెండు టీడీపీ గ్రూపులతోపాటు మరో రెండు గ్రూపుల్లో తనపై అసత్య ఆరోపణలతో కూడిన పోస్టులను పెట్టడాన్ని ఆయన శనివారం తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు వారిపై ఎస్ఐ రామకృష్ణారావుకు ఫిర్యాదు చేశారు. తన పరువుకు భంగం కలిగేలా పోస్టులు ఉన్నాయని, వారిపై విచారణ చేయాలని కోరారు. లేని పక్షంలో రాష్ట్ర న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానన్నారు.

మోసకారి టీడీపీకి ఓటుతో బుద్ధి చెబుతాం

చింతపాక గ్రామస్తులు



చింతపాకలో చేతులెత్తి వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలుపుతున్న కూలీలు

బుచ్చెయ్యపేట: ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న వైఎస్సార్‌సీపీకి రానున్న ఎన్నికల్లో సంపూర్ణ మద్దతు ఇస్తామని చింతపాక గ్రామస్తులు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు కరణం ధర్మశ్రీ, బూడి ముత్యాలనాయుడులకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని గ్రామంలో జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, సర్పంచ్ గొలజాన శ్రీను తదితరులు శనివారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ క్రమంలో ఉపాధి పనుల ప్రాంతంలో వేతనదారులను పలకరించారు. వారంతా గ్రామానికి, తమకు మేలు చేసిన వైఎస్సార్ సీపీకే మరలా ఓటు వేసి గెలిపిస్తామని బహిరంగంగా మద్దతు ప్రకటించారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు గతంలో డ్వాక్రా, రైతు రుణాలు మాఫీ చేయకుండా మోసం చేశాడని, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగులకు నెలకు రూ.2 వేల భృతి ఇవ్వలేదన్నారు. దగాకోరు చంద్రబాబు మాటలు నమ్మబోమన్నారు. తమ గ్రామ అభివృద్ధికి కోట్లాది రూపాయలతో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ సెంటర్, తారురోడ్డు ఏర్పాటు, పాఠశాల అభివృద్ధి, ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి తమ మద్దతు ఉంటుందన్నారు. ఎమ్మెల్యేగా కరణం ధర్మశ్రీని, ఎంపీగా ముత్యాలనాయుడును గెలిపిస్తామన్నారు. మండల ఇన్‌చార్జి గేదెల శేషు, పార్టీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, మండల సచివాలయ కన్వీనర్ కోరుకొండ అప్పలనాయుడు, సర్పంచ్ కె. ఈశ్వరరావు, నాయకులు నాయుడు, ప్రకాష్ పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణానికి పెళ్లిరాట



రామాలయం వద్ద పెళ్లిరాట వేస్తున్న గ్రామస్తులు



అర్జునగిరిలో కల్యాణరాట వేస్తున్న పెద్దలు

బుచ్చెయ్యపేట: సీతారామ కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శనివారం పలు గ్రామాల్లో రామాలయాల వద్ద పెళ్లిరాట వేసి ఉత్సవాలు ప్రారంభించారు. ఈ నెల 17న శ్రీరామనవమి వేడుకలు సందర్భంగా బుచ్చెయ్యపేట, వడ్డాది మేజర్ పంచాయతీ, రాజాం, గున్నెంపూడి, దిబ్బిడి, పెదమదీన, విజయరామరాజుపేట, మంగళాపురం, తురకలపూడి, పీడీ పాలెం తదితర గ్రామాల్లో ఆలయాలకు రంగులు వేసి ముస్తాబు చేస్తున్నారు. సీతారాముని కల్యాణానికి ఐదు రోజుల ముందు వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా కల్యాణ రాట వేసి ఉత్సవాల పనులు ప్రారంభించారు. బుధవారం సీతారాముని కల్యాణాన్ని ఘనంగా నిర్వహించడానికి ఆయా గ్రామాల నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

చీడికాడ: శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఉదయం కల్యాణ రాట కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ నెల 17న సీతారాముల కల్యాణ మహోత్సవాలకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎంపీ అభ్యర్థి బూడికి సబ్బవరం నాయకుల మద్దతు



ముత్యాలనాయుడును సత్కరిస్తున్న సబ్బవరం మండల నాయకులు

దేవరాపల్లి: వైఎస్సార్‌సీపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడుకు రోజు రోజుకు ప్రజా మద్దతు పెరుగుతోంది. ప్రజా సంఘాల నాయకులతోపాటు ప్రజలు స్వచ్ఛందంగా తరలి వచ్చి మద్దతు ప్రకటిస్తున్నారు. సబ్బవరం మండలం తవ్వవానిపాలెం మాజీ సర్పంచ్ సూరినాయుడు, ఎంపీటీసీ బాలకృష్ణ, శ్రావణ్‌కుమార్, కాశిబాబు, సన్యాసినాయుడు తదితర వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం తారువలో బూడిని కలిసి ఘనంగా సత్కరించారు. అనకాపల్లి ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపించేందుకు తామంతా కృషి చేస్తామని ప్రకటించారు. స్థానికేతరుడైన కూటమి అభ్యర్థి సీఎం రమేష్‌ను ఓడించేందుకు పార్లమెంట్ పరిధిలోని ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు.

నేత్ర శస్త్రచికిత్సలకు 40 మంది ఎంపిక



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

దేవరాపల్లి: తిమిరాంలో శనివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి, అనకాపల్లి జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరాన్ని సర్పంచ్ రెడ్డి సూర్యనారాయణ, దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గర్రెడ్డి రాము ప్రారంభించారు. శిబిరంలో వంద మందికి శంకర్ ఫౌండేషన్ వైద్య సిబ్బంది కంటి పరీక్షలు చేశారు. వీరిలో 40 మందిని కంటి శస్త్రచికిత్సలకు ఎంపిక చేసి ప్రత్యేక బస్సులో విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి తరలించారు. క్యాంప్ కోఆర్డినేటర్ సిహెచ్. అశ్వనికుమార్ తదితరులు పాల్గొన్నారు.

తైపురం మాజీ సర్పంచ్ మృతికి సంతాపం

బుచ్చెయ్యపేట: తైపురం మాజీ సర్పంచ్ దేగల అప్పారావు అనారోగ్యంతో విశాఖలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. అతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, సర్పంచ్ ముచ్చకర్ల శ్రీను సంతాపం వ్యక్తం చేశారు.

ఉపాధి పనుల పరిశీలన

మాకవరపాలెం: జంగాలపల్లిలో ఉపాధి పనులను ఎంపీడీవో చంద్రరావు శనివారం పరిశీలించారు. మస్టర్ షీట్లను తనిఖీ చేశారు. బోగస్ మస్టర్లు వేస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ప్రని ప్రదేశాల్లో తాగునీరు, టెంట్లు ఏర్పాటు చేయకపోతే తనకు ఫిర్యాదు చేయాలని కూలీలకు సూచించారు.

అయ్యన్నపాత్రుడు మాటల గారడీలో దిట్ట

- ఆదరించండి..అండగా ఉంటా..
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



గణేష్ అన్నా విజయం నీదే అంటూ చిరునవ్వు వ్యక్తం చేస్తున్న మహిళ



ఎమ్మెల్యే గణేష్‌కు హారతులు పడుతున్న మహిళలు



ప్రచారంలో ఉత్సాహంతో విజయ సంకేతం చూపుతున్న మహిళలు

నర్సీపట్నం: మాయమాటలు చెప్పి మోసం చేయడంలో మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు దిట్ట అని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ విమర్శించారు. మున్సిపాలిటీలోని 7, 8 వార్డుల్లో మాజీ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడితో కలిసి శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే గణేష్‌కు వార్డు ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభించింది. తీన్‌మార్ డప్పులతోపాటు వైఎస్సార్ బెలూన్స్ ప్రచారంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళలు రెట్టించిన ఉత్సాహంతో ప్రచారంలో పాల్గొన్నారు. నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ తిరిగి సంక్షేమం, అభివృద్ధి గురించి వివరించారు. రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలన్నారు. ప్రజలు సుదీర్ఘకాలం పాటు అయ్యన్నపాత్రుడుకు అధికారం కట్టబెట్టారన్నారు. ఆరు సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా చేసిన అయ్యన్నపాత్రుడు నియోజకవర్గం అభివృద్ధిని గాలికి వదిలేశారని ధ్వజమెత్తారు. 40 ఏళ్ల అధికారంలో చేయని అభివృద్ధి ఐదేళ్లలో ఏ విధంగా చేస్తాడో ప్రజలు ఆలోచన చేయాలన్నారు. ఎన్నికల్లో మాయమాటలు చెప్పి మోసం చేయటం అలవాటుగా మారిందన్నారు. అక్రమ సంపాదనపై ఉన్న దృష్టి అభివృద్ధిపై లేదని ఎద్దేవా చేశారు. నాతవరం మండలానికి జూనియర్ కళాశాల తీసుకురావటంలో విఫలమైతే, తాను జూనియర్ కళాశాల తీసుకొచ్చానన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలని ఎమ్మెల్యే కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, వార్డు ఇన్‌చార్జి కిల్లాడ లోవరాజు, కోఆప్షన్ సభ్యుడు లగుడు స్వామి, పార్టీ నాయకులు కర్రి రామ్‌గోపాల్, చింతకాయల వరుణ్, గవిరెడ్డి స్వామినాయుడు, కౌన్సిలర్లు జగదీశ్వరి, కర్రి చైతన్య, డైరెక్టర్లు కర్రి శ్రీను, షేక్ ఉన్నీషా బేగం, బయపురెడ్డి గణమ్మ, ఆరుగుల్ల రాజుబాబు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌కు చేరిన ఈవీఎంలు

- కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య భద్రపరిచిన అధికారులు



ప్రత్యేక వాహనంలో తీసుకొచ్చిన ఈవీఎంలను ఆర్వో జయరాం సమక్షంలో దించుతున్న సిబ్బంది



చోడవరం గవర్నమెంటు హైస్కూల్ స్ట్రాంగ్ రూమ్‌లో ఉంచేందుకు తెచ్చిన ఈవీఎంలు

నర్సీపట్నం: సార్వత్రిక ఎన్నికల్లో వినియోగించేందుకు అవసరమైన ఈవీఎంలు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లోని స్ట్రాంగ్ రూమ్‌లకు శనివారం చేరాయి. జిల్లా కేంద్రం నుంచి ప్రత్యేక వాహనంలో కట్టుదిట్టమైన భద్రత మధ్య తీసుకువచ్చారు. ఆర్వో హెచ్.వి.జయరాం, అన్ని రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచారు. ఎంపీ ఎన్నికకు సంబంధించి మాత్రమే ఈవీఎంలు వచ్చాయని ఆర్వో తెలిపారు. మొత్తం 262 ఈవీఎంలు, బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు వచ్చాయని ఆర్వో తెలిపారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీరాములు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఏకా శివ, బీజేపీ సతీష్, టీడీపీ రమణ, సీఐ కాంతికుమార్ పాల్గొన్నారు.

చోడవరం: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు (ఈవీఎం) చోడవరం చేరాయి. ఆర్వో చిన్నికృష్ణ పర్యవేక్షణలో భారీ పోలీసు బందోబస్తు మధ్య గాంధీ గ్రామం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు తీసుకొచ్చారు. వీటిని అధికారులు, అన్ని పార్టీల నాయకుల పర్యవేక్షణలో ఇక్కడ స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. నియోజకవర్గంలో 243 పోలింగ్ కేంద్రాలు ఉండగా, వాటిలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు వినియోగించేందుకు 486 ఈవీఎంలను తీసుకొచ్చారు.

మాడుగుల: ఈవీఎంలతోపాటు వీవీప్యాడ్‌లు స్థానిక ఆర్‌సీఎంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కు చేరుకున్నాయి. రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో వీటిని స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచామని ఆర్వో సత్యవాణి తెలిపారు. తహసీల్దార్ సత్యనారాయణ, ఎన్నికల డీటీ రాజా పాల్గొన్నారు.

కేజీబీవీ ఇంటర్ విద్యార్థుల ప్రతిభ



హరిప్రియ



భాగ్యలక్ష్మి

మాకవరపాలెం: ఇంటర్ ఫలితాల్లో కేజీబీవీ విద్యార్థినులు సత్తా చాటారు. ప్రథమ సంవత్సరం నుంచి 36 మంది పరీక్షలు రాయగా 26 మంది, ద్వితీయ సంవత్సరం నుంచి 17 మందికి 15 మంది ఉత్తీర్ణత సాధించారని ఎస్‌వో త్రివేణి తెలిపారు. ప్రథమ సంవత్సరం విద్యార్థిని ఎల్.హరిప్రియ 442, ద్వితీయ సంవత్సరం విద్యార్థిని భాగ్యలక్ష్మి 917 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులు వెలగా పావని 377, సవరపు దిలీప్‌బాబు 371, ద్వితీయ సంవత్సరం నుంచి మళ్ల వసంతి, దివ్యదుర్గ 898, సిహెచ్.దివ్య 839 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారు.

కింతలి వల్లాపురం విద్యార్థిని..

మాడుగుల రూరల్: ఇంటర్ పరీక్ష ఫలితాల్లో కింతలి వల్లాపురం గ్రామానికి చెందిన గజ్జాల ద్రాక్షాయణి ప్రథమ సంవత్సరంలో ప్రతిభను కనబరిచింది. ఈమె విజయనగరం జిల్లా తాటిపూడి ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల జూనియర్ కళాశాలలో ఎంపీసీలో 459 మార్కులు సాధించింది. తండ్రి తాపీమేస్త్రి, తల్లి కూలీ పనులు చేసుకుంటూ కుమార్తెను చదివించుకుంటున్నారు. వీరికి సొంత ఇల్లూ లేదు. గతేడాది కింతలి జెడ్పీ హైస్కూలులో పదో తరగతిలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణురాలైంది. ఏపీ ఆర్జేసీలో మంచి ర్యాంకు సాధించడం వల్ల తాటిపూడిలో సీటు వచ్చింది. కుమార్తెను తల్లిదండ్రులు శనివారం అభినందించారు.

నేడు జిల్లా స్థాయి ఎడ్ల పరుగు, ముగ్గుల పోటీలు

మాడుగుల రూరల్: కె.జె.పురం తాచేరు నది సమీపంలో గంగాలతల్లి తీర్థం ఆదివారం ఘనంగా నిర్వహించనున్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేస్తున్నామన్నారు. 3 గంటల నుంచి జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు పోటీలు నిర్వహించనున్నామనానరు. మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన బళ్లకు రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.2 వేలు అందజేస్తామన్నారు. జిల్లా స్థాయి ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.